# స్వేచ్ఛావిహంగం

"ఏరి వీరి గుమ్మడి పండూ ... వీరి పేరేమి?"

"కబడీ, కబడీ, కబడీ, కబడీ, కబడీ"

"కోతి కొమ్మచ్చి, కోతికొమ్మచ్చి, కోతికొమ్మచ్చి"

సందెవేళ వీధిలో పిల్లలు గందరగోళంగా ఆడుకుంటున్నారు.

"వెధవల్లారా ఏమిటాల్లరి" అని గట్టిగా పిల్లల్ని ఆప్యాయంగా కసురుకుంటున్నారు అప్పుడప్పుడూ వసారాలోకి తొంగిచూసే తల్లులు. "అక్కడేం చేస్తున్నావురా?" ఏడుస్తున్న రెండేళ్ల కొడుకుని ఎత్తుకొని వసారాలోనికి వస్తూ గట్టిగా అరిచింది సుభద్ర.

కాంపౌండ్ వాల్ గేటు దగ్గర నిలబడి వీధిలో పిల్లలు ఆటలని మైమర్చి చూస్తున్న నందు తుళ్లిపడి సుభద్రవైపు చూసాడు. ఆమె ముఖంలో చికాకు స్పష్టంగా కనిపిస్తుంది. ఆమె చేతుల్లో బాబు ఏడుపు ఆపటం లేదు.

"వీణ్ణి ఆడించకుండా అక్కడేం బొమ్మలాట చూస్తున్నావ్?" కళ్లు చిట్లించి నందూని విసుగ్గా చూసింది సుభద్ర.

నందు ఒక్క వుదుటున వరండాలోకి వచ్చి ఆమె చేతుల్లోంచి బాబుని అందుకున్నాడు. బాబుని వాడికి ఇవ్వటంతో తన పని అయిపోయినట్టు ఆమె లోపలికి వెళ్లిపోయింది. ఏడుస్తున్న బాబుని నవ్వించటమే తన జీవిత ధ్యేయమన్నట్టు గుర్రంలా సకిలించాడు. ఏనుగులా వాడిని ఎక్కించుకొని తిప్పాడు. పిల్లిలా, కుక్కలా, కోతిలా, పులిలా, కోయిలలా, గాడిదలా అరిచాడు. బాబు ఏడుపు ఆపటం లేదు. బాబుని రెండు చేతుల్తో కాస్త పైకి ఎత్తి గిరగిరా తిప్పాడు. బాబు ఏడవటం మాని చిన్నగా నవ్వాడు. నవ్విన బాబు తిరిగి ఏడవకుండా వాడితో ఆడుతున్నా, అరుస్తున్నా నందు మనసంతా వీధిలో ఆడుకుంటున్న పిల్లల కేరింతల పైనే వుంది.

వీధి దీపాలు వెలిగాయి.

వీధిలో సందడి తగ్గింది.

నందూ అలిసిపోయాడు.

బాబు నిద్రపోయాడు.

బాబుని సుభద్రకి అందించి నందు వరండాలోకి వచ్చాడు. నిశ్శబ్దం మత్తుగా పర్చుకొంది. వాకిట్లో నులక మంచం వాల్చుకొని నందు పడుకున్నాడు. వెన్నెల మురిపెంగా నవ్వుతోంది. తారలు మిలమిలా కలలు కంటున్నాయ్. శివలింగాల పూల వాసన మత్తుగా పలకరిస్తుంది. ఆ వెన్నెల్లో తారల్ని చూస్తూ ఆ పరిమళం ఆస్వాదించటం అతడికెంతో ఇష్టం.

"నీకెన్నిసార్లు చెప్పాలిరా? ఇలా ఆరుబయట పడుకోవద్దని. తెల్లార్లూ కురిసే మంచు ఒంటికి మంచిది కాదంటే వినవేం. రా లోపలికి!" వరండాలో నిలబడి అంది సుభద్ర. ఆమె స్వరంలో తీవ్రతకి అతడు బాధపడలేదు. కాని తనని లోపలికి పిల్చిందని అతడు బాధపడ్డాడు. ఆ వెన్నెలని, తారల్ని, సౌరభాల్ని విడవలేక తప్పదన్నట్టు లోపలికి వెళ్లాడు.

స్టోర్ రూమ్ ప్రక్కన చిన్న గది. ఆ గదిలో నవ్వారు మంచం. మంచంపై బొంత. దానిపై ఆకుపచ్చ గళ్ల దుప్పటి. తెల్లని గలీబుతో తలగడ కాళ్లవైపు కప్పుకోడానికి పచ్చ దుప్పటి. మరీ చలేస్తే కప్పుకోడానికి పాత రగ్గు. పడుకొని ఏం తోచనట్టు వెలుగుతున్న బల్బు వైపు చూశాడు. తెల్లని గది కప్పుని చూస్తుంటె అతడికి నల్లని ఆకాశం గుర్తొచ్చింది. చప్పున లైటార్పేసాడు. చీకటి... గదినిండా చీకటి... అమావాస్య ఆకాశంలా. తారల్లేవ్. మబ్బుపట్టిన ఆకాశమా. మమతలెరగని ఆకాశమా వెన్నెల కాసే ఆకాశమా?

మిలమిల మెరుపుల తారలేవే? ఆ తారలేవే... అతడికి తన తల్లి సోమిద పాడే పాట గుర్తొస్తోంది. అతడికి మంచంపై పడుకుంటే నిద్ర రావట్లేదు. అసౌకర్యంగా పక్కపై అటూ ఇటూ కదిలాడు. కాళ్ల దగ్గర దుప్పటి తీసుకొని నేలపై పర్చి దానిపై పడుకున్నాడు. కొద్ది సేపటికి అతడిని నిద్ర పలకరించింది. అతడు మత్తుగా నిద్రలోకి జారుకుంటుండగా "ఏయ్ నందూ! లే! లేచి మంచంపై పడుకో" అన్ని గదుల్లో లైట్లార్పి, బెడ్ లైట్స్ వేస్తూ, నందూ గదిలోకి వచ్చిన సుభద్ర క్రింద పడుకొని వున్న నందూని చూసి గట్టిగా కేకలేస్తూ అంది.

నందూ పలకలేదు.

"ఏయ్! లే, లే" అతడిని కుదుపుతూ గట్టిగా అంది సుభద్ర.

"ఊ" నిద్రలోనే అటునుండి ఇటు కదుల్తున్నాడు నందు.

"నిక్షేపంలా మంచంపై పడుకోరా అంటే ఇలా నేలపై పడుకుంటావేంరా! లే పురుగు, పుట్రా తిరుగుతుంటాయ్" అంది సుభద్ర.

నందూకి పూర్తి మెలుకువ వచ్చింది. లేచి కూర్చుని నిద్రకళ్లతో సుభద్రవైపు చూశాడు.

"మంచంపై పడుకో" అని సుభద్ర బెడ్ లైట్ వేసి మెయిన్ లైట్ ఆర్పి వెళ్లిపోయింది.

"పురుగు, పుట్రా వుంటాయని క్రింద పడుకోనివ్వరు. పోనీ బయట పడుకుందామంటే

మంచు పడుతుందని ఆరుబయటా నిద్రపోనివ్వరు" అనుకుంటూ మంచంపై పడుకున్నాడు నందు.

★ ★ ★

"నందూ! టిఫిన్ తిను" అంది సుభద్ర.

కీ ఇస్తే ఆడే బొమ్మలతో బాబుని ఆడిస్తున్న నందు నిరాసక్తంగా వంటింటివైపు కదిలాడు. సుభద్ర అతడికి టిఫిన్ ఇచ్చింది. నాలుగు బ్రెడ్ స్లయిసెస్, జామ్, కప్పునిండా పాలు. నందూకి బ్రెడ్ ఇష్టం లేదు. బ్రెడ్ అనేకాదు ఆమె రోజూ పెట్టే ఏ టిఫిన్ వాడికి సహించదు ఒక్కరోజు తినటం మానేయగలడు. కాని రోజూ... ఏం తినకుండా ఎలా వుండగలడు? అందుకే ఆమె పెట్టిన టిఫిన్ తినగలిగినంత తిని మిగిలింది ఆమె చూడకుండా పారేస్తాడు.

★ ★ ★

"నందూ! భోజనం చెయ్" అంది సుభద్ర.

అన్నం, ముద్దపప్పు, రసం, బంగాళాదుంప వేపుడు, కొబ్బరి పెరుగు పచ్చడి, పెరుగు.

అన్నీ చప్పగా వుంటాయి. సుభద్ర కారం ఎక్కువ వెయ్యదు. ఉప్పు సమంగా వేస్తుంది. ఆ చప్పటి భోజనం చెయ్యాలంటే నందూకి విసుగ్గా వుంది. అతను మెల్లగా సుభద్ర దగ్గరికి వెళ్లి "మిరపకాయలు కావాలి" అన్నాడు.

"ఎందుకు?"

నందూ మాట్లాడలేదు.

"తింటావా?"

"ఆఁ.... పెరుగన్నంతో నంచుకోడానికి" మెల్లగా అన్నాడు.

"ఓరి వెధవ! కూర కావాలని అడగొచ్చుగా. నడు కూర ఇస్తాను" అంది సుభద్ర చిన్నగా నవ్వి.

"కూ.... కూర వుంది" అన్నాడు.

"మరింకేం కావాలి?.... కొబ్బరి పచ్చడి ఇవ్వనా"

"ఊఁ...హు మిరపకాయ కావాలి"

"ఎందుకు?" అయోమయంగా అడిగింది సుభద్ర.

"కారంగా వుంటుందని".

"కారం తింటావురా? కారం ఎక్కువగా తినకూడదు. అసలు కారమే కాదు ఉప్పు, పులుపు, తీపి ఏదీ ఎక్కువ తినకూడదు. ఇంటికి మంచిది కాదు. అసలే చిన్నాడివి. వద్దురా, కారం తినొద్దు" మందలింపుగా అంటూ సుభద్ర చదువుతున్న పుస్తకంలోకి తల దూర్చేసింది.

నందూకి సుభద్రపై బోల్డంత కోపం వచ్చింది. "ఒక్క మిరపకాయ అడిగితే ఇవ్వలేదు. తినకూడదంట. తినకూడదూ? నేనీ అన్నమే తినను" అని ఓ మూలకి పోయి

కూర్చున్నాడు.

ఆకలి!

నందూకి విపరీతంగా ఆకలేస్తుంది. "తినకపోవటం చూసి మిరపకాయ ఇస్తుందేమో" ఆశగా అనుకున్నాడు నందు.

బాబుకి పాలు కలపాలని వంటింటివైపు వస్తున్న సుభద్రకి నందూ అన్నం పళ్లెం నిండుగా కన్పించటంతో వెనక వసారాలోకి వెళ్లి "ఏరా! ఇంకా తినలేదేం?" అంది.

"మిరపకాయ"

"చెపితే నాక్కాదూ? కారం తింటే నాకేమైనా వస్తే? నీకేం దర్జాగా పక్కే ఎక్కేస్తావ్? బాబునెవడు చూస్తాడు? వాడి పనితో ఇంటి పనితో నాకొస్తుంది రోగం" విసుగ్గా అంది సుభద్ర. ఆమె నోటికి భయపడి నందూ భోజనం చెయ్యటం మొదలు పెట్టాడు.

★ ★ ★

సాయంత్రం అయింది.

"కబడి, కబడి, కబడి, కబ......"

"నీకు బుద్ధుందా?" సుభద్ర అరుపుకి కూత మర్చిపోయి నిశ్చలంగా నిలబడి పోయాడు నందు.

"ఇప్పుడే వచ్చాను" నెమ్మదిగా అన్నాడు.

"నువ్విలా మట్టిలో ఆడితే ఎలా? ఆ మట్టి చేతుల్తోనే బబుని ఎత్తుకుంటావ్. నడు ఇంట్లోకి" కసిరింది సుభద్ర. నందు నెమ్మదిగా ఇంట్లోకి వచ్చాడు. కాళ్లు, చేతులు కడుక్కొని బాబుని ఆడిస్తూ కూర్చున్న నందూకి తన గూడెం గుర్తొచ్చింది. పచ్చపచ్చని కోనల నడుమ చిన్ని పూరిళ్ల గూడెం. గూడెంకి ఆనుకొని మెల్లమెల్లగా పారే సెలయేరు. మరోవైపు నాగరిక జీవనం నుండి వేరుచేస్తూ ఓ నల్లని ఎత్తయిన కొండ. ప్రతి ఏడు సంక్రాంతికి ఆ కొండపై జాతర జరుగుతుంది. ఆ కొండపై వెలసిన దేముడికి ఆలయంలో ప్రతిరోజు దీపం వెలిగించే పూజారిల్లు ఆ కొండకి చేరువలోనే. ఇటు గూడెం వాసులు, అటు పట్టణ ప్రజలు పూజారికి పరిచయమే.

గూడెం ప్రజలకి అడివే జీవనాధారం. అడవిలోని పుల్లలు, తేనె, విస్తరాకులు, కుంకుళ్లు సంతలో అమ్మేవాళ్లు. కడుపు నింపడానికి ఎంత కష్టపడాలో అంతవరకే శ్రమించే వాళ్లు. మిగిలిన సమయమంతా విశ్రాంతిగా గడిపేవారు. పిల్లలకి చేపలు పట్టడమంటే బోల్డంత ఇష్టం. చేపలు నిత్యాహారం. అక్కడ పిల్లలు ఆడని ఆట, పాడని పాట లేదు. గంగులు ఒక్కగానొక్క కొడుకు నందు. గంగులుకి సంపాదనపై మనసు పడింది. రాజారాం ఆ వూరికి కొత్తగా ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిన ప్రభుత్వోద్యోగి. అతని భార్య సుభద్రకి ఓపిక తక్కువ. తన రెండేళ్ల కొడుకుని ఆడించటానికి ఎవరైనా చిన్న కుర్రాడు కావాలని పూజారితో చెప్పాడు. తొమ్మిదేళ్ల నందుని గంగులు బలవంతంగా రాజారాం ఇంట్లో పనికి పెట్టాడు. సుభద్రకి శుభ్రత ఎక్కువ. పనిలోకి చేరిన నందుకి శుభ్రత గురించి రోజు

చెప్పేది. ఇంట్లో వుండేది ఇద్దరే కాబట్టి వూరికే పాలు, పళ్లు వస్తుంటాయి కాబట్టి నందూకి బలమైన ఆహారమే పెట్టేది. అయినా నందు రోజు రోజుకీ చిక్కిపోతున్నాడు.

★ ★ ★

"నాయనా! నేనిక్కడుండన్రా. గూడెం వచ్చేస్తాను అన్నాడు నందు తనని చూడటానికి వచ్చిన గంగులుతో.

"నువ్వొస్తే బాబునెవడు చూస్తార్రా" అన్నాడు గంగులు.

"నేనొస్తానే" బ్రతిమాలాడు తల్లిని.

"నువ్విడనే వుండ్రా. బాబు బెంగెట్టుకుంటాడు" అంటున్న తల్లిని విసుగ్గా చూసాడు నందు.

"నువ్వెళ్లిపోతే ఎలారా? పండక్కి గుడికి వెళ్లాలి. బాబుని ఎత్తుకొని. నువ్వు మాతోరా" అంది అప్పుడే అక్కడికి వచ్చిన సుభద్ర.

సుభద్రతో జాతరకి? కాస్త వేగంగా పరిగెత్తినా, పంచదార చిలకల్ని కొంటానన్నా, రంగుల రాట్నం తిరుగుతానన్నా, పులివేషగాళ్లని చూస్తూ నిలబడినా సుభద్ర అరుస్తోంది. జాగ్రత్తలు చెపుతుంది. "ఈ ఏడు జాతర చూసినట్టే" నిరాశగా అనుకున్నాడు నందు.

★ ★ ★

నందు బాబుని ఎత్తుకొని ఇంటి చుట్టూ తిరుగుతున్నాడు. రేపే భోగి. పెద్ద పెద్ద దుంగలు దొంగతనంగా తెచ్చి వేసే మంట గుర్తొచ్చింది. ఏమైందా అల్లరి? ఎక్కడికి పోయిందా సందడి?

నందు బాబు వైపు కోపంగా చూశాడు. వీడే! వీడి వలనే ఈ బాధలు. కట్టడి, క్రమశిక్షణ, శుభ్రత, తనకి ఇష్టమైన తిండి తినడానికి, తనిష్టమొచ్చినట్టు ఆడుకోడానికి తనకి నచ్చిన చోట నిద్రపోవటానికి.... వీల్లేదు. కాలు కదిపితే బాబు. పెదవి విప్పితే బాబు. బాబు... బాబు... బాబు... ఎవడీ బాబు? నందూకి బాబు ఏడుపు వినిపించట్లేదు. గూడెంలో పండగ సందడి విన్పిస్తోంది. పిల్లలు ఎగరేసే పతంగులు కనిపిస్తున్నాయి. నందు బాబుని పెరట్లో వదిలి వీధిలోకి వచ్చి తదేకంగా కొండవైపు చూశాడు. పరిగెత్తి పారిపోతే?

"రోడ్డుమీద ఏ తోలుబొమ్మలాట చూస్తున్నావురా?" నందు ఉలిక్కిపడి వెనక్కి చూశాడు. నందూ వీపుపై ఒక్క దెబ్బ పడింది. మట్టిలో పార్లే బాబుని ఎత్తుకుని వెనకే నిలబడి వున్నాడు రాజారాం.

నందూ మాట్లాడలేదు. మరో దెబ్బ చెంపని తాకింది.

"నే పెరట్లోకి వెళ్లుండటం కాస్త ఆలస్యమైతే బావిలో పడుండేవాడు వెధవ. నడింట్లోకి" కోపంగా అన్నాడు రాజారాం.

పెరట్లో నీళ్ల బావి వుంది. ఆరాత్రి నిద్రపోయేవరకూ నందూపై అరుస్తూనే వున్నారు సుభద్ర, రాజారాం.

నందూని కొట్టిన దెబ్బలు శరీరంపై మాయమయ్యాయి. కాని మనసు మండిపోతోంది.

పారిపోవాలి. ఇక్కడినుండి పారిపోవాలి. వాడి పసిమనసు ఘోషిస్తోంది.

గూడెంలో వున్నంతకాలం వాడికి కట్టడి తెలియదు. అంతా వాడి ఇష్టమే.

ఏనాడైతే మనిషికి నిబంధనలు, నిర్బంధము మనసుని కష్టపెడుతుందో ఆనాడే మనిషి స్వేచ్ఛ కోసం తపిస్తాడు. స్వేచ్ఛాజీవి కావాలని పోరాటం సాగిస్తాడు.

గూడెంలో వున్నంతకాలం నందు తను ఆనందంగా జీవిస్తున్నానని అనుకోలేదు. ఆనందం వర్తమానంలో స్ఫురించదు. గతాన్ని పలకరిస్తుంది. భవిష్యత్తుని మురిపిస్తుంది.

నందు తన గదిలో నుండి మెల్లిగా బయటికి వచ్చాడు. పారిపోవాలి. తలుపు తీసుకుని పారిపోవాలి. నందూ గుమ్మంలో అడుగు పెడుతుంటే వాడికి చప్పున బాబు గుర్తొచ్చాడు. పారిపోతే రేపు తండ్రి "బాబునెవడు చూస్తాడని" వెనక్కి తెస్తాడు. బాబు బెంగెట్టుకుంటాడంటుంది తల్లి. "బాబుని ఆడించడానికి రా!" అని పిలుస్తుంది అమ్మ.

ఇవన్నీ జరగకుండా వుండాలంటే బాబు అనేవాడే వుండకూడదు.

నందూ సుభద్ర గదిలోకి వెళ్లాడు. సుభద్ర మంచం ప్రక్కనే ఓ చిన్ని మంచంలో నిద్రపోతున్న బాబుని చేతుల్లోకి తీసుకొని పెరట్లోకి వచ్చాడు. నందూ చూపులు ఏవైపు అలజడిగా కదలట్లేదు. బాబుని నీళ్ల బావిలో జారవిడిచి వీధిలోకి వచ్చాడు. ఓ పసివాడిని నీళ్లలో వదిలేసాననే బాధ వాడిలో లేదు. తనకి ప్రతిబంధకమైన దానిని వదిలించుకున్నాననే తృప్తి.

తన ఆటలకి, పాటలకి, తన జీవన విధానానికి ఇంకే అడ్డులేదు. తననింక ఎవ్వరూ ఏ విషయంలో అడ్డుకోరు.

ఇష్టమైన ఆట... పాట... భోజనం... నిద్ర... మాట. నిక్కరు రెండు జేబుల్లో రెండు చేతులుంచుకొని, చిన్నగా ఈల వేస్తూ కొండవైపు హుషారుగా అడుగులేస్తున్నాడు.

నందూని చీకటి భయపెట్టడం లేదు. చలి బాధించడం లేదు. తను.... తన గూడెం.... తన జీవితం, తన ఆనందం ఇవే ఆలోచనలు.

స్వేచ్ఛ వ్యక్తి ఇచ్చినంత తృప్తి, ఆనందం ప్రపంచంలో ఇంకేదీ ఖచ్చితంగా ఇవ్వదు. వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతివ్యక్తి మనసు ముంగిట ఆనంద విహంగాలు ఎగరేసే శక్తి స్వేచ్ఛకి మాత్రమే వుంది.

తెలతెలవారబోతోంది. మరో రెండు అడుగులేస్తే కొండ నడుముకి చేరుకుంటాడు నందు. ఇంతలో అతడి లేత భుజంపై ఓ బలిష్టమైన చెయ్యి. చప్పున వెనక్కి చూశాడు. ఖాకీ దుస్తులు, ఆ వెనక రాజారాం. దుఃఖాశ్రువులతో.

"నడు క్రిందికి" అన్నాడొకడు.

"ఎక్కడికి?" తెల్లబోతూ అడిగాడు నందు.

అతడికి ఎవ్వరూ సమాధానం చెప్పలేదు.

నందుకి అంతా అయోమయంగా వుంది. గూడెన్ని చేరుకోలేదని బాధ వుంది. కాని అతడికి భయం వెయ్యటం లేదు. ఎందుకంటే అతడికి కటకటాలు తెలియవు. జైలు

గోడలు తెలియవ్. వాటిని నందు ఏరోజూ చూడలేదు. ఆలోచించలేదు. అనుభవంలోకి రానివాటి గురించి ఆలోచన అతడికి గూడెం నేర్పించలేదు.

నందు ముందుకి అడుగేస్తూ వెనక్కి తలతిప్పి చూశాడు. మరింత ముందుకి తొంగి చూశాడు. అతడికేం కన్పించలేదు. గూడేనికి ఆఖరి అంచైనా కనిపిస్తుందేమోనని అతడెంతో ఆత్రుతగా చూస్తుంటే గూడెపు స్వేచ్ఛా పవనమొక్కటి అతడిని జాలిగా స్పృశించింది.

• స్రవంతి వారపత్రిక *1989* •